ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా


ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవంలో మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించి ఆదర్శ డివిజన్‌గా తీర్చి దిద్దుతానని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని రాజిరెడ్డి కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులతో పూర్తి చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, అంజి, శివ, నిరంజన్‌రెడ్డి, క్రాంతికుమార్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న కిరణ్‌కుమార్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారిని మంగళవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డిని అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈట లావణ్య, మాజీ పాలక మండలి సభ్యులు నల్లా రఘుమారెడ్డి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, అర్చకులు అంబ ప్రసాద్‌శర్మ, ప్రవీణ్‌శర్మ పాల్గొన్నారు.

నియామకం


ముప్పిడి ధన్వంత్

మలక్‌పేట: జాతీయ బౌద్ధ మహాసభ తెలంగాణ ప్రధాన కార్యదర్శిగా మలక్‌పేటకు చెందిన ముప్పిడి ధన్వంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. ధరంపాల్ మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ధన్వంత్ మాట్లాడుతూ..బుద్ధుడి ఆశయాల సాధన, మహాసభను మరింత పటిష్టం చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవాలు



దిల్‌సుఖ్‌నగర్: సంకీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్ వార్షికోత్సవాలు సంగీత గురువులు సత్యవతికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌కేపురం వాసవీ ఆధ్యాత్మిక కేంద్రంలో కనులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు, ప్రత్యేక అతిథులుగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ నరసింగరావు, ఉపేందర్‌రెడ్డి, సంగీత గురువు నూకల జగదీశ్వరి, నూకల సోమయాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగీత విశిష్టత గురించి వివరించారు. యాదవ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మైసయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వరులు, కార్యవర్గ సభ్యులు, డాక్టర్ ఎస్.మాధవరెడ్డి సంగీత వాయిద్యకారులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్ కాలనీ అభివృద్ధికి కృషి

వనస్థలిపురం: ప్రశాంత్‌నగర్ కాలనీలోని సమస్యలను పరిష్కరించి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కాలనీ అంతర్గత రోడ్లు, స్ట్రీట్‌లైట్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని, పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయించాలని కాలనీవాసులు కార్పొరేటర్‌ను కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కార్పొరేటర్ పర్యటన

వనస్థలిపురం: నర్సింహారావు నగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు మంగళవారం ఆయన నర్సింహారావు నగర్‌లో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో తరచూ మురుగు రోడ్లపై ప్రవహిస్తోందని కాలనీవాసులు తెలపడంతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత సూపర్‌వైజర్‌కు సూచించారు. శాశ్వత పరిష్కారానికి ఉన్నతాధికారులతో మాట్లాడుతానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

ప్రారంభమై రెండేళ్లు.. పూర్తికి ఇంకెన్నాళ్లో?

- నత్తనడకన ఎఫ్ఓబీ పనులు
- రోడ్డు దాటాలంటే జంకుతున్న జనాలు

ఎల్బీనగర్: బాటసారుల సౌకర్యార్థం నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎల్బీనగర్ జోనల్ పరిధిలో నిర్మించే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు రెండేళ్ల నుంచి కొనసాగుతున్నాయి. రంగారెడ్డి జిల్లా కోర్టు సముదాయం ముందు నిర్మించే ఈ బ్రిడ్జి పనుల్లో అధికారుల నిర్లక్ష్యంతో ముందుకు సాగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు రూ. 1.50 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ బ్రిడ్జి పనుల్లో ఇప్పటికి పురోగతి లేదని, ఇంతకు బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందా లేదా అని చర్చించుకుంటున్నారు.

తరచూ ప్రమాదాలు..

నిత్యం కోర్టు కేసుల్లో వచ్చేవారు.. మరో పక్క కూరగాయల మార్కెట్‌కు వచ్చే కొనుగోలుదారులు, రంగారెడ్డి జిల్లాకు చెందిన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో క్రీడల కోసం రోజు చాలా మంది వస్తుంటారు. వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలతో బిక్కుబిక్కుమంటూ రోడ్డు దాటుతున్నారు. రంగారెడ్డి కోర్టు ముందు నిర్మించే ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో రోడ్డు దాటే బాటసారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించిన జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రమాదాలు నివారించే దిశలో ఎల్బీనగర్ జోనల్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను ప్రారంభించారు.

దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో పూర్తి..

దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో ప్రారంభించిన బ్రిడ్జి ప్రారంభం కావడంతో అక్కడ ప్రయాణికులకు ఊరట కలిగింది. రెండో బ్రిడ్జి రంగారెడ్డి జిల్లా కోర్టు వద్ద ప్రారంభించి రెండేళ్లుగా పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికి ఈ బ్రిడ్జి అందుబాటులోకి రాకపోవడవతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు ఇక్కడ రోడ్డు దాటి కోర్టుకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దాటుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందల సంఖ్యలో ప్రమాదాలు జరిగి కొందరు మృతి చెందగా మరి కొందరు క్షతగాత్రులై మంచాలకే పరిమితమవుతున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని బాటసారులు కోరుతున్నారు.



ఎల్బీనగర్‌లో కొనసాగుతున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని సుల్తానాఅల్వా 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ వెల్లడించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు.. చంపాపేట పాతబస్తీ, సుల్తానాఅల్వా, కటకోని కుంట, సాయిరాంనగర్, నేతాజీనగర్ పరిసర కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.28, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.23, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.28, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.18, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.40, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.65, బీట్‌రూట్ రూ.23, కీర రూ.35, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.40. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

కాంగ్రెస్ విజయంలో ఆర్టీసీ కార్మికులది కీలకపాత్ర


మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

హయత్‌నగర్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసి సంస్థ ఆస్తులను అమ్మేయాలని కుట్ర చేసిందని, సంస్థను కాపాడుకునేందుకు కార్మికులు చేసిన పోరాటానికి కాంగ్రెస్ మద్దతు ఇచ్చిందని కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఆర్టీసీ కార్మికులు కీలక పాత్ర పోషించారని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లోని బొమ్మిడి నాగిరెడ్డి గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు అందించిన సహకారం మరువలేనిదని వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని వారికి తెల్ల రేషన్ కార్డులు, ఆసరా పింఛన్లు అందేలా చూస్తామన్నారు. రిటైర్డ్ కార్మికుల భవనం కోసం జీహెచ్‌ఎంసీ పరిధిలో వెయ్యి గజాల స్థలాన్ని గుర్తిస్తే భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని లేకుంటే తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో వెయ్యి గజాల స్థలాన్ని ఇప్పించేందుకు తాను బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. లగ్జరీ బస్సుల్లో రిటైర్డ్ ఎంప్లాయిస్‌కు రెండు సీట్లను కేటాయించేందుకు రవాణా శాఖ మంత్రితో చర్చిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఏ రహమాన్ సోఫీ, కోటయ్య, బుచ్చిరెడ్డి, ఆనందం, రాజయ్య, పీఎస్ఎన్ రావు, అయ్యన్నగౌడ్, పాండురంగారావు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి


బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హస్తినాపురం: మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ, గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర సహాయ మంత్రి బండిసంజయ్ దిష్టి బొమ్మను మంగళవారం హస్తినాపురం చౌరస్తాలో యువజన కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కె.శివకుమార్, హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శిఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ, గద్దర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను బండి సంజయ్ వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని లేకుంటే తెలంగాణలో బండిసంజయ్ తిరగకుండా ఎక్కడికక్కడ అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యారెడ్డి, సాయినికేశ్, సాయి రాంరెడ్డి, సమాలేటి సాయి, దాడి రుత్విక్‌రెడ్డి, మన్నె రాముయాదవ్, దాసు ,మనోజ్, బ్రహ్మాచారి, కొమ్ము శివయాదవ్ , రాముగౌడ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం


మల్‌రెడ్డి రాంరెడ్డిని సత్కరిస్తున్న ఆటో డ్రైవర్లు

చైతన్యపురి: ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించిన మల్‌రెడ్డి రాంరెడ్డిని పలువురు డ్రైవర్లు మంగళవారం సత్కరించారు. బీఎన్‌రెడ్డినగర్, ఎల్బీనగర్ ప్రాంతాల నుంచి ఐఎస్‌సదన్ వరకు ఆటోలు నడిపేందుకు ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. దీంతో ఈ సమస్యను మల్‌రెడ్డి రాంరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. సానుకూలంగా స్పందించిన ఆయన పోలీసులతో మాట్లాడి ఐఎస్‌సదన్ వరకు ఆటోలు నడిపేందుకు అనుమతిని ఇప్పించారు. తమ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఆటో డ్రైవర్లు సంతోష్‌యాదవ్, శ్రీకాంత్, కాటం, చాన్‌పాషా, అజీమ్, మహేందర్, నర్సింహ, లింగం పాల్గొన్నారు.

సైలెన్సర్లు మార్చితే కేసులు నమోదు చేస్తాం


సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

హస్తినాపురం: ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు మార్చి భారీ శబ్దం వచ్చేవి అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భూపతి గట్టుమల్లు హెచ్చరించారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో సైలెన్సర్లు మార్చిన ద్విచక్ర వాహనాదారులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా గట్టుమల్లు మాట్లాడుతూ.. ద్విచక్రవాహనాలకు భారీ శబ్దం వచ్చే సైలెన్సర్లు పెట్టుకోవద్దని దీనివల్ల ఇతరులకు ఇబ్బంది కలగడంతో పాటు శబ్ద కాలుష్యం అవుతుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు నిధులు కేటాయించాలి

బడంగ్‌పేట్: ప్రభుత్వ స్కూళ్లను స్థానిక సంస్థల్లో, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో విలీనం చేసి పేద విద్యార్థుల చదువులకు అన్ని వసతులు కల్పించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ ప్రస్తుత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ఐదేళ్ల పాలనలో దిగ్విజయంగా పూర్తి చేసుకున్నందుకు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధికి కార్పొరేషన్‌లో రూ.450 కోట్లు వెచ్చించామన్నారు. ఆయా కార్పొరేషన్‌లో ఉన్న ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించడానికి నిధులు ఎందుకు కేటాయించడం లేదని ప్రభుత్వాన్ని, గత పాలకవర్గాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం పునరాలోచన చేసి పేద పిల్లలు చదువుకుంటున్న ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ముందుకురావాలని కోరారు. డిప్యూటీ మేయర్‌గా తనకు అవకాశం కల్పించి సహకారం అందించిన స్థానిక ఎమ్మెల్యే, మేయర్, కార్పొరేటర్లు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సెల్‌ఫోన్ల దొంగల రిమాండ్



నాగోలు: బస్టాప్‌లు, వారాంతపు సంతల్లో సెల్‌ఫోన్ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్, ఎస్ఐ రమేష్ వివరాల ప్రకారం.. బండ్లగూడ అయ్యప్ప కాలనీ చెందిన దీపక్ ప్రదాన్, ఒడిస్సా రాష్ట్రానికి చెందిన ధన్‌రాజు కూలీలుగా పనిచేస్తున్నారు. జల్సాలకు అలవాటు పడి నేరాల బాట పట్టారు. బస్టాపులు, సంతల్లో సంచరిస్తూ సెల్‌ఫోన్ల చోరీలకు పాల్పడుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నాగోలు బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. 16 సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చాదర్‌ఘాట్: చికిత్స పొందుతున్న గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 24న మలక్‌పేట మెట్రో స్టేషన్ సమీపంలో అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి(50)ని పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

పరామర్శ

చైతన్యపురి: ఇటీవల వెన్నెముక శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతిలో ఉన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని గడ్డిఅన్నారం డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు రమణారెడ్డి, విక్కి, బంటి, వెంకటేష్ మంగళవారం కలిసి పరామర్శించారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సూర్యనాయక్

నాగోలు: ఆటో డ్రైవర్లందరూ రోడ్డు నిబంధనలు పాటించాలని నాగోలు ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నాగోలు చౌరస్తాలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూర్యనాయక్ మాట్లాడుతూ.. రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్, శ్రీనివాస్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన..

విద్యార్థులు రోడ్లపై వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని నాగోలు ఇన్‌చార్జి ఆర్టీఓ అమర్నాథ్ అన్నారు. నాగోలు పరిధిలోని బీసీ సంక్షేమ బాలికల హాస్టల్‌లో రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించినట్లయితే విద్యార్థులు భవిష్యత్‌లో ప్రమాదాలు బారిన పడకుండా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు అనిత, వేణు, మురళీ కుమార్ పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని మంగళవారం నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాగోలు చెరువు సుందరీకరణకు నిధులు విడుదల చేయాలన్నారు. పలు కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

తొలిదశ ఉద్యమకారులకు సముచిత గౌరవం ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు

మన్సూరాబాద్: తొలిదశ (1969) తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు జారీ చేసి, గౌరవ ప్రదమైన పింఛన్ రూ.10 వేలు అందజేయాలని 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు డిమాండ్ చేశారు. మంగళవారం మన్సూరాబాద్ ఇందిరానగర్‌కాలనీలో నిర్వహించిన ఉద్యమకారుల సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలిదశ ఉద్యమకారులు 70, 80 ఏళ్లు నిండిన వారికి ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. గత ప్రభుత్వం తొలిదశ ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలన్నారు. తొలిదశ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభమైందని, తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను అధికారంలోకి వచ్చిన పాలకులు విస్మరిస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని పలుమార్లు అపాయింట్‌మెంట్ కోరిన ఇంత వరకు ఇవ్వలేదని, రాష్ట్ర మంత్రులు జోక్యం చేసుకుని సీఎం అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రావు, సీనియర్ ఉపాధ్యక్షుడు వనం చంద్రమౌళీ, కోశాధికారి యేళ్ల చంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు సీతారాంరెడ్డి, బొమ్మిడి లక్ష్మీనారాయణ, కూతురు కృష్ణమూర్తి, విశ్వేశ్వర్‌రావు, మల్లయ్య పాల్గొన్నారు.

సిబ్బందిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి


నిరసన వ్యక్తం చేస్తున్న మార్కెట్ కమిటీ ఉద్యోగులు, టీఎన్జీవోస్ ఏఎంసీ నాయకులు

చాదర్‌ఘాట్: మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ ఎస్‌జీఎస్‌పై జరిగిన దాడిలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ దామోదర్ డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ అధ్యక్షుల పిలుపు మేరకు మంగళవారం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఓఎస్‌జీఎస్ మాట్లాడుతూ.. ఎస్‌జీఎస్‌పై దాడి హేయమైన చర్య అని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చైర్మన్ చెకొలేకర్ లక్ష్మి మాట్లాడుతూ.. రైతుల ముసుగులో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు దాడులు చేయడం సిగ్గుచేటన్నారు.


నిరసన తెలుపుతున్న సిబ్బంది

ఎన్టీఆర్‌నగర్‌లో..

దిల్‌సుఖ్‌నగర్: అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిపై దాడిని వ్యతిరేకిస్తూ మంగళవారం ఎన్టీఆర్‌నగర్‌లోని ఎల్బీనగర్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయం ఎదుట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగులతో టీఎన్జీవోస్ ఏఎంసీ ఉద్యోగస్తుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు చిలుక నర్సింహా రెడ్డి, కార్యదర్శి ముక్రంతో కలిసి పలువురు నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ కార్యదర్శిపై దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశం, చంద్రశేఖర్, సంతోష్, శ్రీనివాస్, రేవంత్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఖలీద్ పాల్గొన్నారు.